పల్లెల్లో మద్యం కిక్కు!

- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల నిర్వహణ
- దుకాణాల్లో సిట్టింగ్ రూమ్‌ల ఏర్పాటు
- చూసీచూడనట్లుగా ఎక్సైజ్ అధికారుల తీరు
- మద్యం సరఫరా దుకాణాలపై చర్యలు శూన్యం



జూపూడిలో మద్యం దుకాణం పక్కనే సిట్టింగ్ రూమ్ వద్ద మందుబాబులు



ఇబ్రహీంపట్నం ప్రాంతంలో మద్యం దుకాణం సమీపంలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి రెండు బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్రతి దుకాణానికి బెల్ట్‌షాపులతో పాటు సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారు. ఎక్సైజ్ శాఖాధికారులు బెల్టుషాపులు నిర్వహించే వారిపై గానీ మద్యం సరఫరా చేసే దుకాణదారులపై గానీ ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

బడ్డీలు, చిల్లర కొట్లలో అమ్మకాలు

కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులు మద్యం షాపులు నిర్వహించేందుకు అవకాశం కల్పించింది. లాటరీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులు మద్యం షాపులను దక్కించుకున్నారు. ధనార్జనే ధ్యేయంగా షాపుల నిర్వాహకులే బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో బెల్ట్‌షాపునకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాలు తెరిపించారు. బడ్డీ కొట్లు, టిఫిన్ సెంటర్లు, చిల్లర దుకాణాల్లో సైతం అమ్మకాలు జరుపుతున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇళ్ల పక్కన బెల్ట్ షాపులు ఉండటంతో మద్యం ప్రియులు చేస్తున్న ఆగడాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. మద్యం సేవించిన వారితో నిత్యం గొడవలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి గ్రామంలో రోడ్ల శివారుల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో రోడ్లపైనే తాగి వీరంగం సృష్టిస్తూ బాటసారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మద్యం మత్తులో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

యథేచ్ఛగా సిట్టింగ్ రూమ్‌లు

ప్రస్తుత మద్యం పాలసీని బట్టి ప్రైవేట్ మద్యం దుకాణాల్లో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తమ వెంట తీసుకెళ్లాల్సి ఉంది. ఆ విధానానికి దుకాణదారులు స్వస్తి పలికారు. ప్రతి మద్యం దుకాణానికి అనుబంధంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం ప్రియులను సిట్టింగ్ రూముల్లో కూర్చోబెట్టి ఫుల్‌గా తాగిస్తున్నారు. వాటర్ బాటిళ్లు, గ్లాస్‌లు, డ్రింక్‌లు, తినుబండారాలు అందుబాటులో ఉంచుతున్నారు. బెల్ట్‌షాపుల్లో అయితే బార్‌ల మాదిరిగా బెంచీలు, కుర్చీలు కావల్సిన ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. జూపూడిలో హైవే పక్కన, ఫెర్రీలో ఇసుక రేవు నుంచి గ్రామం వరకు మూడు షాపులు నడుపుతున్నారు. కొండపల్లిలో వివిధ ప్రాంతాలతో పాటు కొత్త గేటు, కొటికలపూడి, మూలపాడు, కేతనకొండ, దాములూరు తదితర గ్రామాల్లో బెల్ట్ షాపులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

గత ప్రభుత్వంలో బెల్ట్‌షాపులకు స్వస్తి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ఆదుకుంది. మద్యం కొనుగోళ్లపై ఆంక్షలు విధించింది. ఒకరికి రెండు నుంచి మూడు బాటిళ్లు విక్రయించే విధానం తీసుకొచ్చింది. బెల్ట్‌షాపులపై పూర్తి నియంత్రణ చర్యలు చేపట్టింది. సిట్టింగ్ రూమ్‌లకు అవకాశం లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలకు మంగళం పాడింది. గ్రామాల్లో బెల్ట్‌షాపులు, సిట్టింగ్ రూమ్‌లు నిర్వహించడంపై ప్రజలు ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బెల్ట్‌షాపులు మూసివేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుత ప్రభుత్వ నూతన మద్యం పాలసీలో మొదట్లో దుకాణాల్లో ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూమ్‌లు, బెల్ట్‌షాపులను చాలా వరకు మూసివేయించాం. ఇంకా ఎక్కడైనా అనధికారికంగా బెల్ట్ షాపులు, సిట్టింగ్ రూమ్‌లు నిర్వహిస్తుంటే వాటిని గుర్తిస్తాం. వాటిపై కూడా తప్పకుండా చర్యలు చేపడతాం.

– గోపాలకృష్ణ, ఎక్సైజ్ శాఖ సీఐ, భవానీపురం

క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మూలపాడు(ఇబ్రహీంపట్నం): సమాచార హక్కు చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. శ్రీనివాసరావు అన్నారు. మూలపాడు రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లోని సమాచారాన్ని కేవలం రూ.10 చలానాతో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ శాఖల్లోని సమాచారం తెలుసుకుని వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖాధికారి డి.శైలజ, టెక్నికల్ అధికారి వాసుదేవ్ నాయక్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆపన్నహస్తం



తిరువూరు: తిరువూరులో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) తమ సంఘంలోని సభ్యుడికి అత్యవసర సమయంలో ఆర్థిక సాయం చేసి పలువురి ప్రశంసలు పొందింది. స్థానిక అశోక్ నగర్‌లో నివసించే అబ్దుల్ నబీ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మంచం పట్టారు. ఏడాది కాలంగా అనారోగ్యం పాలైన నబీ వైద్య సేవలకు, కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు రూ.1,44,000 నగదు సేకరించి ఆయనకు గురువారం అందజేశారు. మరో పూర్వ విద్యార్థుల సంఘం (దోస్త్) కూడా రూ.70 వేల ఆర్థిక సాయాన్ని నబీ వైద్యసేవల నిమిత్తం అందించింది.

ఉపాధి పనుల పరిశీలన



తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు గురువారం పరిశీలించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్ష్మీపురం, ముష్టికుంట్ల, ఎరుకోపాడు, కాకర్ల గ్రామాల్లో చేపట్టిన ఫాం పాండ్స్, కమ్యూనిటీ సోక్ పిట్లు, అవెన్యూ ప్లాంటేషన్, ఫిష్ పాండ్ మార్కింగ్‌లను ఎన్ఆర్ఈజీఎస్ అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం పరిశీలించింది. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ షణ్ముఖ కుమార్, పలు జిల్లాల గ్రామీణాభివృద్ధి సంస్థల అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు పాల్గొన్నారు.

142 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): అయాన్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 142 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ప్రారంభించారు. డాక్టర్ బషీర్ అహ్మద్, అక్బర్, చందు, షబ్బీర్,వినోద్ వైద్య సేవలందించారు.

ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ వ్యవస్థపై పర్యవేక్షణ



నూజివీడు: ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ వ్యవస్థ పటిష్టవంతంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ ఆడిట్ నిమిత్తం సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ అంతా తిరిగి డీఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావు, ఏఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, పట్టణ ఎస్ఐ జ్యోతిబసు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ బ్రహ్మస్వాములు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

తిరువూరు ఆర్డీఓ మాధురి



మైలవరం: రీ సర్వేకు రైతులు సహకరించాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె.మాధురి అన్నారు. రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లిలో గురువారం జరిగిన రీ సర్వే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సర్వే పనులను రైతులు దగ్గరుండి ఎటువంటి అభ్యంతరాలు రాకుండా చూసుకోవాలన్నారు. రీ సర్వే వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. రెడ్డిగూడెం గ్రామంలో ప్రభుత్వ వైద్యశాలను తహసీల్దార్ సుశీలాదేవితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు సీహెచ్ సందీప్, ఆర్ఐ గంధం పుల్లయ్య, మండల సర్వేయర్ జె.మురళి, రైతులు పాల్గొన్నారు.

డీవైఈఓ ఆకస్మిక తనిఖీ



ముసునూరు: నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ గురువారం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు 97 మంది 10కి 10 గ్రేడులను సాధించాలని, ప్రేరణ కల్పించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విజయం సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు తరగతిలోనికి వెళ్లే ముందు పాఠ్యాంశ బోధనపై పూర్తిగా సిద్ధపడి, తగిన సమాచారంతో వెళ్లాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎం పద్మకిశోర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాంబాబు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలు వెలవెల

సిబ్బంది ఇష్టారాజ్యం



ఒక్క ఉద్యోగి కూడా లేకుండా ఖాళీగా ఉన్న బోర్వంచ గ్రామ సచివాలయం

నూజివీడు: గత ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ రైతుల ఇంటి వద్దకే అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రభుత్వ నిర్లిప్తత వెరసి సచివాలయాల్లో పని చేసే ఉద్యోగుల ఇష్టారాజ్యంగా తయారైంది. నూజివీడు మండలం బోర్వంచలోని గ్రామ సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్క ఉద్యోగి కూడా సచివాలయంలో లేరు. 10 మంది సిబ్బంది ఉన్నా ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన గ్రామస్తులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎవరైనా వస్తే సమాధానం చెప్పడానికి సచివాలయంలో స్వీపర్‌ని కాపలాగా ఉంచారు. పంచాయతీ కార్యదర్శి, ఇద్దరు వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, గ్రామ సర్వేయర్, గ్రామ ఉద్యాన సహాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి తదితరులు ఉండాలి. వీరిలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. దీనిని బట్టే అధికారుల పని తీరు అర్థం అవుతోంది.

ఎల్బీఆర్సీఈలో గెస్ట్ లెక్చర్



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం: విద్యార్థులు అడిటివ్ మాన్యుఫాక్చరింగ్‌లో పట్టు సాధించాలని పాండుప్ అప్లికేషన్స్ ఫౌండర్, సీఈఓ అద్వైత్ గుప్తా అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సిమ్యులేషన్ అండ్ మోడలింగ్ ఫర్ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్‌లో వినూత్నంగా కృత్రిమ మేధని ఉపయోగించి వివిధ రకాలైన ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో ఎలా తయారు చేయవచ్చో వివరించారు. ఆటోమేషన్‌లో కృత్రిమ మేధ ఉపయోగాలను తెలిపారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, గౌరవ కార్యదర్శి డాక్టర్ ఏవీ నరేష్ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా విద్యార్థి సభ్యత్వం, ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు అడిటివ్ మాన్యుఫాక్చరింగ్‌లో ప్రావీణ్యత సాధించి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలకు వచ్చిన ప్రతిష్టాత్మక ఐఈఐ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావుకు ఐఈఐ చైర్మన్, కార్యదర్శి అందజేశారు. కార్యక్రమంలో ఏరో స్పేస్ విభాగాధిపతి డాక్టర్ పి.లోవరాజు, సివిల్, మెకానికల్, ఏరో స్పేస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లో కగార్ పేరుతో చేస్తున్న నరమేధాన్ని తక్షణం ఆపాలని, ఇది మావోయిస్టులను అణిచే చర్యగా కేంద్రం ప్రచారం చేస్తున్నప్పటికీ వాస్తవంగా ఈ చర్య గ్రీన్ హంట్ కంటే ప్రమాదకరమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అటవీ, ఖనిజ, వృక్ష సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధమైందని విమర్శించారు. నేడు అటవీ చట్టాలను పార్లమెంట్ సాక్షిగా కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు తెచ్చి కగార్ ఆపరేషన్ చేపట్టడం ద్వారా అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టే కార్యక్రమాన్ని చేస్తోందన్నారు. దీనివల్ల అడవులపై వారికున్న యాజమాన్య హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పౌర హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా అడవులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన



అమ్మవారిని దర్శించుకున్న అసిస్టెంట్ కలెక్టర్

పెనుగంచిప్రోలు: అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తిరుపతమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ ఆదేశించారు. ఈనెల 11న నిర్వహించనున్న అమ్మవారి కల్యాణం, పెద్ద తిరునాళ్ల ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆలయంలో ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లు, అలాగే కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించి ఆలయ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కల్యాణం జరిగే స్థలం, మునేరు అవతల దీక్షాస్వాములకు అన్నదానం నిర్వహించే చోట భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, భక్తులకు తాగునీటి వసతి కల్పించే విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. తొలుత అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ అసిస్టెంట్ కలెక్టర్‌ను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో నందిగామ డివిజన్ ఆర్డీఓ కె.బాలకృష్ణ, ఏసీపీ తిలక్, తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, ఆలయ ఈఈ రమ, జగ్గయ్యపేట సీఐ పి. వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జి శ్రీను, ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్, ఏఈఓ ఉమాపతి, ఆలయ ఏఈ రాజు పాల్గొన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

తిరువూరు: మండలంలోని ఎరుకోపాడులో కోడి పందేలు వేస్తున్న ఇద్దరిని తిరువూరు పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. గ్రామంలో జూదాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సత్యనారాయణ దాడి చేసి 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు కోడి పుంజులు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పలువురు పారిపోయారు. జూదరులపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి తిరు కల్యాణోత్సవాలు

మైలవరం: మైలవరంలోని వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరిస్తామన్నారు, 8న అంకురార్పణ ధ్వజారోహణ, రాత్రి 8 గంటలకు హనుమంత వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు. 11న రాత్రి 8 గంటలకు వేంకటేశ్వరస్వామి వారి తిరు కల్యాణోత్సవం అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం, 12న రాత్రి 9 గంటలకు స్వామి వారి రథోత్సవం జరుగుతుందని చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

శోభనాచలుడి సేవలో సబ్ కలెక్టర్

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి రథ సప్తమి ఉత్సవాల సందర్భంగా గురువారం స్వామి వారిని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌ను సత్కరించారు. ఆయనకు ఆలయ విశిష్టత గురించి అర్చకులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, వీఆర్వోలు పత్తిపాటి శ్రీను, వంశీ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విస్సన్నపేట: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కొండపర్వ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థినులు, గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతిలో ప్రవేశానికి మార్చి 2వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

తిరువూరు: ఇటీవల నేరగాళ్ల నమ్మకపు మాటలతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నందున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు సీఐ గిరిబాబు అన్నారు. గంపలగూడెం తోటమూల సెంటర్‌లో గురువారం గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హామీ లేకుండా రుణాలు మంజూరు చేస్తామని, లాటరీలో డబ్బులు తగిలాయని, క్రెడిట్ కార్డు మంజూరైందని వచ్చే మెసేజీలు నమ్మి లింకులపై క్లిక్ చేయవద్దని సీఐ సూచించారు. దుకాణదారులు భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గంపలగూడెం ఎస్ఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి కుండలు పోయే.. డబ్బాలు వచ్చే!



చనుబండలో తాటి చెట్టుకు కల్లు సేకరించేందుకు అమర్చిన ప్లాస్టిక్ డబ్బాలు

క్రమేపీ సంప్రదాయ వస్తువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొనడంతో ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్నారు. తాటి చెట్లు, ఈత చెట్ల నుంచి కల్లు సేకరించేందుకు గీత కార్మికులు పూర్వం నుంచి మట్టి కుండలను వినియోగించేవారు. కుండల ఉత్పత్తి తగ్గడం, వాటి ధర పెరగడంతో మండలంలోని చనుబండ గ్రామంలో తాడి చెట్టు నుంచి కల్లు సేకరించేందుకు కుండలకు బదులుగా ప్లాస్టిక్ డబ్బాలను గీత కార్మికులు వినియోగిస్తున్నారు.

– చాట్రాయి

ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో అత్యవసర వైద్యం



మైలవరంలో మాట్లాడుతున్న డాక్టర్ జయప్రకాష్

తిరువూరు: గుండె పోటు వచ్చిన వారికి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడేందుకు విలువైన ఇంజెక్షన్ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా అందజేస్తున్నామని వైద్యులు తెలిపారు. రూ.45 వేల విలువైన ఈ ఇంజెక్షన్‌ను తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచామన్నారు. ఛాతీ నొప్పి లేదా గుండె నొప్పి వచ్చిన గంట లోపు బాధితులను తమ ఆస్పత్రికి తీసుకొస్తే ఈ ఇంజెక్షన్ ఇచ్చిన అనంతరం వైద్య సేవలకు తరలించవచ్చని వివరించారు.

రూ. 45 వేల విలువ చేసే ఇంజెక్షన్ ఉచితం..

మైలవరం: గుండెపోటు బాధితులకు అత్యవసర వైద్యం మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో అందుబాటులో ఉందని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడమ ఛాతీ నొప్పి, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే గుండె నొప్పి కావచ్చని, వెంటనే మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకువస్తే వస్తే రూ.45,000 విలువ చేసే ఇంజెక్షన్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. దీని వలన గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయే వారిని కాపాడవచ్చని వివరించారు. వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం లేని ఉద్యానవనం

నిరుపయోగంగా పొట్టి శ్రీరాములు పార్కు



నిరుపయోగంగా ఉన్న తిరువూరు పొట్టి శ్రీరాములు పార్కు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు ఉద్యానవనంలో పచ్చదనం కరువైంది. 1967లో తిరువూరు పంచాయతీ బోర్డు సర్పంచి యర్రమిల్లి బుచ్చిరాజు ఈ పార్కును నిర్మించారు. పచ్చదనంతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే ఈ పార్కు నిర్వహణను తర్వాత పాలకులు విస్మరించడంతో శిథిలావస్థకు చేరింది. పునర్నిర్మించిన పార్కును 2022 మార్చి 16న అప్పటి ఎమ్మెల్యే కె. రక్షణనిధి ప్రారంభించారు. చిన్నపిల్లల ఆట వస్తువులు మినహా ఉద్యానవనంలో ఇతర సదుపాయాలేవీ లేకపోవడం, కనీసం పచ్చదనానికి మొక్కలు నాటకపోవడంతో నిరుపయోగంగా మారింది. పొట్టి శ్రీరాములు పార్కు పేరు సూచిస్తూ కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ లోవరాజును వివరణ కోరగా, పట్టణంలో వేరే ప్రదేశాల్లో పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదించామని చెప్పారు. పొట్టి శ్రీరాములు పార్కుకు బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



నూజివీడు పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ స్టేజీ వద్ద ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు



నూజివీడు పట్టణంలోని తిరువూరు బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లెక్సీ

నూజివీడు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించకుండా నూజివీడు పట్టణంలో అలాగే వదిలేశారు. మున్సిపల్ అధికారుల తీరుపై రాజకీయ పక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని తిరువూరు బస్టాండ్ వద్ద, ఎమ్మార్ అప్పారావు కాలనీ స్టేజీ వద్ద టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించకుండా అలాగే వదిలేశారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడంతో పాటు ఇక్కడ ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ అమలు కాకపోవడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు లీటర్ల సారా పట్టివేత

చాట్రాయి: మండలంలోని సి-గుడిపాడు గ్రామంలో గురువారం దాడి చేసి గంధం వెంకటేశ్వరమ్మ వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితురాలిపై కేసు నమోదు చేశామని చెప్పారు.